# పడవలో

మల్లాది రామమూర్తిగారు

—అమృతకిరణుడు ఆకాశంలో తన శీతలకిరణములను వెదజల్లుచున్నాడు. ఆ కిరణప్రసారం జనులందరికీ ఆనందం కలుగజేస్తున్నది.

అదో నదీప్రవాహం. వేగం యెక్కువగా వుంది. చల్లని పిల్లవాయువులు వీయడం మొదలు పెట్టినవి. గట్లన్నీ చెట్లతో నిండివున్నై. అప్పుడప్పుడు ఒక్కొక్క పండు నీళ్లల్లో పడుతున్నది. అది ఆ నదికెయి సమయంలో, సహజశాంతాకారం దాల్చివున్న ప్రకృతి కన్యను మెల్లగా కదలిస్తున్నది. ఆ చెట్లనుండి, పండ్లు, ఆకులు రాలి నీళ్లల్లో పడ్డప్పుడల్లా ఉలికులికి పడుతున్నది—ప్రకృతి.

ఆ ప్రవాహంలో ఓ పడవ. అదీ ప్రవాహం, యిద్దరూ బాల్యస్నేహితులు. ఇద్దరూ ఎప్పుడూ కలిసి మెలిసీవుంటారు. ఒకరినొకరు విడచివుండడం చిన్నప్పటినుంచీ లేదు. ఆనాడు పడవా, ప్రవాహం, యిద్దరు కలిసి ఒకేదారిని పోతున్నారు. వాళ్లిద్దరూ ఏమి మాట్లాడుకుంటున్నారో ఎవ్వరికీ తెలియటం లేదు. కాని యేదో 'బుంయ్యి' మను మ్రోతమాత్రం వినబడుతూ వుంది.

పడవవాడు యేదో పాటపాడుతూ తెడ్డేస్తున్నాడు. ప్రయాణీకులంతా నిద్రపోతున్నారు. మధ్య మధ్య ఒకరిద్దరుమాత్రం గురక పెడుతున్నారు. పడవవాడికి కష్టం అనిపించింది పాపం—తెడ్డువెయ్యడం. కాస్త నడుము వాలుద్దామనుకున్నాడు. పడవ పై భాగంమీద మెల్లగా కూర్చున్నాడు ఏమిటో దీర్ఘంగా ఆలోచిస్తూ. "ఇక నా యీజన్మ యింతేనా? నా జీవితవృక్షానికి పండ్లూ, ఫలాలు లేవా? నాటుకున్న వేర్లుకూడా తెగిపోవలసిందేనా? చేసుకున్న భార్యతో సౌఖ్యం అనుభవించేగీత నానుదుటిమీద వ్రాయలేదు కాబోలు—భగవంతుడు. పోనీ, యీ పాటికి చేతికి అక్కరకువచ్చే బిడ్డడు........" అంటూ కండ్లు తెరచి చూచాడు—పడవకేసి. తెండ్రుబిందువులు రాలినై ఆ ముసలికండ్లల్లోనుంచి అప్రయత్నంగా. ఆ నేత్రాలప్పుడు అర్ధనిమీలితాలైనై. ఒక నిమిషము—ఒక ఘడియ—ఒక గంట—పడవ తనదారిన తాను పోతూవుంది. ముసలివాడు ఉలిక్కిపడి లేచిచూచాడు. ఎందుకు? ఏమో!!

మళ్లీ కళ్లు మూశాడు. వేకువజాము అయింది. పడవ ఒడ్డుదగ్గరకు చేరుతూవుంది. పడవవాడికి అదివరకు జరిగిన తన కథ జ్ఞాపకంవచ్చింది—కలలో.

అది మహాసముద్రమధ్యమం. అలలు, చిందరవందరగా యిష్టంవచ్చిన దిక్కుకు, దొక్కుంటామని కాబోలు, వడిగ తిపోతున్నై. దారీడొంకా లేకుండా. కొన్ని కెరటాలు ఆకాశంలోకి దొమ్ముకొని పోతున్నవి—భూమ్యాకాశాలు రెంటినీ కలిపి పైన స్వర్గంలోవుండే దేవతలకు క్రింద భూలోకంలో వుండే ప్రజలకు సాంగత్యం సమకూరుద్దామని.

అందులో ఓ చిన్నపడవ. అది ఆ చిన్నసముద్రంలో తూగుటుయ్యాలలాగ వూగుతూవుంది. అందులో వుండేవాళ్ల హృదయములుకూడా సముద్రపు కెరటాల్లాగ చిందరవందరగా పైకీ క్రిందికీ వూగుతున్నై. ఆ ఒడ్డో—యీ ఒడ్డో—అంతర్భాగమో!

అంతట్లోకే ఓ మంచుకొండ. పడవ ప్రక్కకు ఒదుక్కుంది. కాని ప్రయోజనంలేదు. మంచుగడ్డ పడవను ఢీకొన్నది. పడవ విచ్ఛిన్నమైంది. ఒక ఆడమనిషికి ఓ చిన్న తెప్ప దొరికింది. అందులో తన చంకలోవున్న కుర్రాణ్ణి విసరిపారేసింది. తాను కూడా అందులో కూర్చుంది. అంచులదాకా నీళ్లు వచ్చినై. లోపలికి ప్రవేశించడానికి మార్గం వెతుకుతున్నై.

* * *

ఆ పడవలో యిద్దరు యెక్కితే మునుగుతుంది. ఒక్కడు ఎక్కితే తేలుతుంది.

* *

640

ఆ పడుచు యిది గ్రహించింది. "కొడుకు బ్రతికితే వంశం..........." అనుకుంది. తాను సముద్రుడికి తన ప్రాణాన్ని అర్పించింది.

ఆ ముసలిపడవవాడు యీదుకుంటూ బయట పడ్డాడు.

పూర్వగాథ అంతమైపోయింది.

* * *

అప్పుడా ముసలివాడికి ఒక తేజోసంబంధమైన స్త్రీ వ్యక్తి కనిపించింది.

"ఎవరునీ?" అన్నాడు.

మాట్లాడలేదు.........చిరునవ్వు.

"అప్పుడే నన్ను మరచిపోయినారా?" అంది.

కండ్లు విప్పి చూచాడు.

"నేను నీ భార్యను కానూ?" అంది.

"నా భార్య యెవరు? ఆమె చనిపోయి చాలా కాలమైంది" అన్నాడు.

"ఆమెనే నేను.........నిన్ను వదలలేక యిట్లా యీ మూడేండ్లనుంచి నీకు కనిపించకుండా కాపాడుతూవున్నా. మన ఋణం యిక తీరిపోయింది. నా మనోమూర్తిని చూచి నే నొక్కసారి ఆనందించా. నీ అర్ధాంగిని చూచి నీ వొక్కసారి...... ......" అంది.

"అయితే ఒకముద్దు—తరువాత నీ యిష్టం—ఇక ఎవరిదారి వారిది. ఈ ఐహికప్రపంచానికీ నీకూ సంబంధం తెగిపోయింది."

"అది కాదు. అది కాదు. అదివల్ల కాదు. ముద్దు—పడవలో పడుకున్న ఆ పచ్చనికుర్రాణ్ణి ముద్దాడు. అతడు నీ కుమారుడు."

కల అయిపోయింది. నిద్ర మెళుకువ వచ్చింది. కండ్లు తెరచి చూచాడు—ఆ ముసలివాడు. ఏమీ ఎదుట కనిపించలేదు. కండ్లల్లో అశ్రుబిందువులున్నై విభ్రాంతి—

"ఏమిటీ యీ కల?" అని ఆలోచించాడు. అది వరకటి తనకథ అని గ్రహించాడు. చనిపోయిన భార్య కండ్లముందు తాండవమాడుతూవుంది. ఆమె తుదిపలుకులు మరుద్దామన్నా మరుపు రావడంలేదు. తెల్లవారుజామువచ్చిన కల వుత్తదిగాదనుకున్నాడు. పడవలోకెళ్లి చూచాడు.

పడవలో మూడేండ్ల కుర్రవాడు. బొద్దుగా, పచ్చగావున్నాడు. ఎత్తుకున్నాడు. ముద్దాడాడు. సముద్రంలో జరిగిన కథంతా ఆ కుర్రాణ్ణి పెంచే తలిదండ్రులకు చెప్పాడు. అతను తన కుమారుడే నని ఒప్పించాడు. కుర్రాణ్ణి మళ్లా చేతులలోకి తీసుకున్నాడు. గట్టిగా కౌగలించుకున్నాడు.

తనకూ వాళ్లకూకూడా ఆ కుర్రాడు ఒక్కడే అని అన్నాడు.

అన్ని కలలూ అసత్యాలేనా!

## సాధ్వి

భమిడి ఉమామహేశ్వరావధానిగారు

అలసివచ్చినవేళ నధిపుపజ్జనజేరి శ్రమదీర్చి సమకూర్చు సంతసంబు;
వంతనొందినవేళ కాంతుచెంతనుజేరి హితువారసికూర్చు కౌతుకంబు;
మాటదోచనివేళ మగనియొండనుజేసి మనసారఁబలికెను మంతనంబు;
క్రోధమూనినవేళ నాథుదండనుజేరి మనసమునఁ గలిసించుకనికరంబు;
పతియె దైవంబు, పతియె సర్వస్వమనుచు,
నిఖిలసుఖదుఃఖములఁ దోడునీడయగుచు,
క్షీరనీరన్యాయమునను జెలగుసాధ్వి
కన్నఁ బతికెన్న నన్య భాగ్యంబుకలదె.